క్లుప్తంగా

స్నేహితుడి జ్ఞాపకార్థం అన్నదానం



మాతృదేవోభవ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న మిత్ర బృందం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు గౌర వెంకటేశ్ 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన స్నేహితులు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, మల్లికార్జున్, కుటుంబసభ్యులు, పలువురు నాయకులు ఉన్నారు.

'ఆదర్శ' విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని వైష్ణవి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు సైన్స్‌డేలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. 9వ తరగతికి చెందిన బి.వైష్ణవి ఉప్పల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్‌డే టాలెంట్ పరీక్షలో 3వ ర్యాంకు సాధించింది. అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఈనెల 27న గుజరాత్ అహ్మద్‌నగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఎంపికయినదని ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రెడ్డి కాలనీ నూతన కార్యవర్గం

హస్తినాపురం: రెడ్డికాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండా వెంకట్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ రెడ్డికాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కె.ఫణికుమార్, ఎస్.రంగారెడ్డి, కె.కె.మనోహర్‌రెడ్డిల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కొండా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోమటిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జి.నర్సిరెడ్డి, కోశాధికారిగా కె.అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కె.గోపాల్‌రెడ్డి, ఎల్.నారాయణరెడ్డిలు ఎన్నికై నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు. అధికారుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. తమను గెలిపించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వరగుప్తా, రమేశ్, అశోక్‌గౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మద్దెలకుంటతండా, రావిచేడ్ గ్రామాల్లో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పర్యటించారు. మద్దెలకుంటతండాలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న యూజీడ పనులను, రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉపసర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీకస్నానాయక్, నాయకులు మల్లేశ్, యాదగిరి, ధర్మ ఉన్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని మంత్రికి వినతి

హస్తినాపురం: పేదలు ఎక్కువగా నివసించే నందనవనం కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ కార్పొరేటర్ పద్మానాయక్ కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ... పేదప్రజలు ఎక్కువగా ఉన్న నందనవనం, భూపేశ్‌గుప్తానగర్‌కాలనీ, దేవీనగర్, ఇంద్రసేనారెడ్డినగర్‌లలో చదువుకుంటున్న వారి కోసం వచ్చే సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌నాయక్, నల్ల నాగిరెడ్డి, భిక్షపతి చారి పాల్గొన్నారు.

భూముల నక్షాలు ఎక్కడ..?

- కందుకూరు, మహ్మద్‌నగర్‌లో ఏళ్ల నుంచి సమస్య
- రికార్డుల్లో ఉండేది ఒకటి.. కనిపించేది మరొకటి
- రీ సర్వే చేయాలని రైతుల డిమాండ్
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

కందుకూరు: నక్షలో తప్పులు సరిచేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రెండు గ్రామాల్లో ఈ సమస్య ఉండగా, మరో రెండు గ్రామాల్లో అసలు నక్షనే లేదు. ఏళ్లుగా సమస్య ఉన్నా రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో సమస్య కొనసాగుతూనే ఉంది. దీంతో రైతులతో పాటు భూములు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపే వారు ఇబ్బందులపాలవుతున్నారు. ఇది మండల పరిధిలోని కందుకూరు, మహ్మద్‌నగర్ గ్రామాలతో పాటు జైత్వారం, గఫూర్‌నగర్ గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్య.

సక్రమంగా లేని నక్ష

కందుకూరు, మహ్మద్‌నగర్ గ్రామాల నక్ష కలిసి కందుకూరు పేరుతో ఒకటే ఉండటంతో సమస్య తలెత్తింది. దీంతో ఆ రెండు గ్రామాలకు సంబంధించి నక్ష సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం, వాస్తంగా ఉన్న భూములు ఉన్న ప్రాంతం సర్వే నంబర్ల ప్రకారం అంతా సవ్యంగానే ఉండగా కేవలం



హెచ్‌ఎండీఏ రూపొందించిన కందుకూరు మండలం మాస్టర్ ప్లాన్

నక్షలో మాత్రమే తప్పుగా నమోదయ్యాయి.

- కందుకూరు రెవెన్యూ పరిధిలో వాస్తవంగా సర్వే నంబర్ 540 ఉండగా, నక్షలో 736 కనిపిస్తుంది.
- అదే రెవెన్యూలో సర్వే నంబర్లు 538కి బదులుగా 719, 539కి బదులుగా 735గా, 538కి బదులుగా 719, 543కి బదులుగా 737, 541కి బదులుగా 775, 542కి బదులుగా 774, 575కి బదులుగా 773, 515కి బదులుగా 776, 490కి బదులుగా 630, 495కి బదులుగా 634 ఇలా దాదాపు 300 నుంచి 1,040 వరకు సర్వే నంబర్లు నక్షలో తప్పుగా నమోదయ్యాయి.
- మహ్మద్‌నగర్ రెవెన్యూ పరిధిలో సైతం సర్వే నంబర్ 131కి బదులుగా 639, 132కి బదులుగా 638, 133కి బదులుగా 648, 134కి బదులుగా 649, 164కి బదులుగా 650 ఇలా అన్ని నంబర్లు తప్పుగా నమోదయ్యాయి.
- మహ్మద్‌నగర్, కందుకూరు ఒకే నక్షగా ఉండటంతో అంతా నంబర్లు కలిసి గందరగోళంగా మారింది. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. మరోపక్క కందుకూరు, మహ్మద్‌నగర్ పరిధి కూడా అర్థంకాకుండా ఉంటుంది.

హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండటంతో..

ప్రస్తుతం ఆ ప్రాంతం అంతా హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండటంతో ఏదైనా ఆయా గ్రామాలకు సంబంధించిన భూముల్లో వెంచర్లు వేసి అభివృద్ధి చేయాలన్నా.. లేదా రైతుల నుంచి భూములను కొనుగోలు చేయాలన్నా ఇబ్బందికరంగా మారింది. సర్వే నంబర్ల ప్రకారం హెచ్‌ఎండీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో సైతం కందుకూరు నక్షను యథాతథంగా ముద్రించడంతో అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తిప్పలు తప్పడంలేదు. మాస్టర్ ప్లాన్‌లో వాస్తవంగా ఉన్న భూమి రెసిడెన్షియల్ జోన్‌లో ఉంటే నక్షలో తప్పుగా సర్వే నంబర్లు నమోదు కావడంతో ఆ ప్రాంతం కన్జర్వేషన్ లేదా అగ్రికల్చర్‌గా, అగ్రికల్చర్ జోన్‌లో ఉన్నవి రెసిడెన్షియల్ తదితర జోన్ల కింద కన్పిస్తున్నాయి. దీంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. కాగా ఆ రెండు గ్రామాలతో పాటు గఫూర్‌నగర్‌కు అసలు నక్షనే లేకపోగా, జైత్వారం గ్రామానికి పూర్తిస్థాయిలో అందుబాటులో లేక రైతులు క్రయవిక్రయాలప్పుడు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న ప్రవీణ్

మహేశ్వరం: చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాలులో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్, ప్రోగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని టెన్త్, ఇంటర్ క్లాస్ టాపర్స్ విద్యార్థులకు ప్రోగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ ఇమ్మడి ప్రవీణ్ ఆదివారం స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. మండల పరిధిలోని ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థులను గుర్తించి మొత్తం 60 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున స్కాలర్‌షిప్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాధవాచారి, బీజేపీ జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య మహేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు పోతర్ల సుదర్శన్ యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రవణ్, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సాయినాథ్, యాదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో సర్దార్‌నగర్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలను 11వ వార్డు కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలలపాటు ప్రతీ ఆదివారం నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడా పోటీలతో నూతన పరిచయాలు ఏర్పడుతాయన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవంలో బుసనగారి సుమన్, నర్సింగ్‌గౌడ్, శివ, కె.శేఖర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోనే దళితులకు అవకాశాలు

దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా

మీర్‌పేట: రాజకీయంగా దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని పార్టీ దళిత మోర్చా రాష్ట అధ్యక్షుడు కొప్పు భాషా అన్నారు. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి మురళీకృష్ణనగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి చెవ్వ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భాషా మాట్లాడుతూ.. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని సీఎం కేసీఆర్ నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడిని రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని.. అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న పార్టీ కూడా బీజేపీయేనని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు ఉంటే అక్కడ మాత్రమే ప్రభుత్వ పథకాల అమలు జరుగుతున్నాయని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు జారీ చేయలేదని, బస్‌పాసులు, విద్యుత్, తాగునీటి, ఇంటి పన్నులను భారీగా పెంచి పేదలపై అదనపు భారం మోపుతున్నారని తెలిపారు.



కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న కొప్పు భాషా

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శి గాజుల మధు, కార్పొరేటర్లు కరుణానిధి, నీలారవి నాయక్, చెవ్వ మణెమ్మ, నాయకులు సూల ప్రభాకర్, ఎస్.చిరంజీవి, సైదులు, నర్సింహ యాదవ్, శ్రీనునాయక్, గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వండి

- పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- మహేశ్వరం చేరుకున్న పాదయాత్ర

మహేశ్వరం: జీఓ నెం 51ని రద్దు చేసి, గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. జీఓ 51 రద్దు కోరుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేలన్నారు. జీఓ నెం 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్‌కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ శ్రమ దోపిడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల సహకారంతోనే పల్లె ప్రగతి కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. పంచాయతీ కార్మికులకు దళిత బంధు పథకం అమలు చేసి, డబుల్ బెడ్రూం



పాదయాత్రలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ నెల 28న నగరంలోని ఇందిరా పార్కు వద్ద పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తున్నామని.. ఈ సభకు పంచాయతీ కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, మహేశ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు సుధాకర్, సోమయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, జిల్లా ఉపాధ్యక్షులు రవి కుమార్, రుద్ర కుమార్, దేవేందర్, సీఐటీయూ జిల్లా నాయకులు శేఖర్, కుర్మయ్య, ఎల్లేశ్, పంచాయతీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల ధారాదత్తం సహించం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్



ప్రహరీని కూల్చివేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులకోసం ధారాదత్తం కట్టపెడితే చూస్తూ ఊరుకోమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (ఈ-సిటీ) ఆదిలక్ష్మి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూమి మధ్యలో రోడ్డు కోసం ఇటీవల నిర్మించిన పహరీని బీజేపీ నాయకులు తొలగించారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు పోలీసుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆలయానికి చెందిన పదెకరాల భూమి మధ్య నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తమ ఇష్టానుసారం ప్రహరీ నిర్మించారు. ప్రైవేట్ వ్యక్తులు చేసిన వెంచర్‌కోసం రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయానికి మూడువైపులా ప్రహరీ ఉన్నప్పటికీ వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రహరీ నిర్మించడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు తమ పనులు విరమించుకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మున్సిపల్ చైర్మన్ మధు మోహన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, పాపాయ్యగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్

కడ్తాల్: అభివృద్ధి సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట ప్రజల విశ్వాసం చూరగొందని.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, బడుగు బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి.. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై చేస్తున్న విమర్శలు, అసత్య ప్రచారాలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అత్యంత ప్రజాచైతన్యం కలిగిన కల్వకుర్తి నియోజకవర్గంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి, ప్రజల తిరస్కరణకు గురైన మీరు.. మూడుసార్లు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన జైపాల్‌యాదవ్ పైన అసత్య ఆరోపణలు తగదని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టలేదని ప్రచారం తగదని .. 250 డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆచారితో పాటు, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు బంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, భిక్షపతి, రాంచందర్, చంద్రమౌళి, ప్రశాంత్ ఉన్నారు.

మ్యాక్ ప్రాజెక్టులో గోల్ఫ్ టోర్నమెంట్



విజేతకు బహుమతి అందజేస్తున్న నవాబు మీర్ నసీర్ అలీఖాన్

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామ పరిధిలో మ్యాక్ ప్రాజెక్టులో బీటీఆర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం 5వ మ్యాక్ గోల్ఫ్ ఇన్విటేషనల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 110 మంది గోల్ఫ్ ఆటగాళ్లు మూడు సెషన్‌లతో పాల్గొన్నారు. ప్రతీ సెషన్‌లో 36 నుంచి 40 మంది ఆటగాళ్లు ఆడారు. విజేతలకు మ్యాక్ ప్రాజెక్టు డా.నవాబు మీర్ నసీర్ అలీఖాన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రికెట్ వెంకటపతి రాజు, డాక్టర్ విజయానంద్‌రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ స్వరంజిత్ సేన్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, మ్యాక్ బీటీఆర్ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, రాజీవ్ రతన్ పలువురు గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

కందుకూరు: క్రీడలతో మానసిక ఆనందంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తగూడలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ 5వ సీజన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. దీంతో స్నేహబంధాలు బలపడతాయన్నారు. కాగా ప్రథమ స్థానంలో నిలిచిన శివాజీ జట్టుకు రూ.21 వేలు నగదును సర్పంచ్ మల్లారెడ్డి అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన భీం ఆర్మీ జట్టుకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి రూ.16 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, వార్డు సభ్యులు సురేందర్‌రెడ్డి, బండారు కృష్ణ, శేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, నిర్వాహకులు ఎల్లారెడ్డి, అంజన్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

వేడుకగా వినాయక బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి హైకోర్టు కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న పూజలలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, భాస్కర్ సాగర్, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, సత్యనారాయణ మూర్తి, ప్రసాద్‌రావు, సులోచన రాణి, అరుణ, మీనాక్షి, భారతి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఆపదలో ఉన్నవారికి అండగా 'ఆర్ట్'

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: ప్రజా సేవలో ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ అండగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆమె మండల పరిధిలోని హర్షగూడ గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెండామ్రి తండాల్లో శివాలయం గుడి గోపురం నిర్మాణానికి రూ.2.50 లక్షలు, వినికిడి, మూగ సమస్యతో బాధపడుతున్న ముగ్గురు చిన్నారులకు చికిత్స నిమిత్తం రూ.1.10లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకే ఆర్ట్ ఫౌండేషన్ స్థాపించామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉన్న ఓ వైద్యురాలిగా ఎప్పుడూ ముందుంటానన్నారు. భవిష్యత్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, వినికిడి లోపంతో బాధపడుతున్న ముగ్గురు చిన్నారుల తల్లిదండ్రులు అనితారెడ్డికి



చెక్కులు అందజేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి

ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షగూడ సర్పంచ్ పాండునాయక్, ఉప సర్పంచ్ రవి నాయక్, ఎంపీటీసీ సభ్యుడు విజయ్‌కుమార్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రాజునాయక్, రాజునాయక్, కుమార్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అందని వైద్యం: కార్పొరేటర్ జీవన్‌రెడ్డి



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్

హయత్‌నగర్: శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా రాష్ట్రంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని, అందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని పేదలకు అందించడం లేదని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని రాఘవేంద్రాకాలనీలో కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో నిజాం నిరంకుశ పాలన సాగుతోందని, బీఆర్‌ఎస్ పాలనలో మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ నాయకులు నర్సయ్య, చిన్న, కోట రవీదర్, సంఘి అశోక్, ఏళ్లరెడ్డి, బాల్‌రెడ్డి, హరినాథ్‌బాబు, మహేష్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: కడ్తాల్ మండలం గడ్డమీదితండా పంచాయతీ పరిధిలోని వెలుగురాళ్లతండాలో తుల్జా భవాని మాత ఆలయంతోపాటు, కిరదాదా ఆలయాల నిర్మాణ పనులకు గిరిజన నాయకుడు, గడ్డమీదితండా గ్రామ సర్పంచ్ పాండునాయక్ ఆదివారం గ్రామప్రజలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాండునాయక్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణాలతో భక్తిభావం పెంపొందుతుందని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజం శాంతి నెలకొంటుందని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులకు ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురువు సేవ్యాబావాజీ, ఉప సర్పంచ్ రమణ, నాయకులు రమేశ్‌నాయక్, సరియానాయక్, వాల్యానాయక్, లోక్యానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, వెంగల్‌రావు, మోహన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూమిపూజలో సర్పంచ్, గ్రామస్తులు